# దృశ్యం – భావం

పూదూరి రాజిరెడ్డి



**మ్యూజింగ్:** దృశ్యం – భావం

**రచన:** పూడూరి రాజిరెడ్డి

ప్రచురణ: కినిగెపత్రిక http://patrika.kinige.com

కాలం: నవంబరు 2014

శాశ్వతలింకు : http://patrika.kinige.com/?p=4033

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

## దృశ్యం – భావం

రోడ్డు మీద మనకు తారసపడే ప్రమాద దృశ్యంలో – మనం పాలుపంచుకోవాల్సిన తప్పనిసరి అవసరం ఎప్పుడోగానీ రాదు. అక్కడెందుకో జనం గుమిగూడారని కుతూహలపడేలోపే, బాధితుడిని ఎవరో బండ్లో ఎక్కిస్తూవుండొచ్చు; అప్పటికే చెదిరిపోతున్న గుంపులోంచి, 'ఎవరో బండిమీదికేలి వద్దరు,' అని వినాల్సి రావొచ్చు; అయితే, అలాంటి దాటిపోయే ప్రయాణికుడిగా ఉండలేని సందర్భం నాకోసారి ఎదురైంది. మా మధును కలవడానికి నేను హుడా కాలనీకి వెళ్తున్నాను. గంగారం దాటుతుండగా – ఉన్నట్టుండి నేను ప్రయాణిస్తున్న వాహనం సడెన్‌బ్రేక్‌తో ఆగిపోయింది; 'అయ్యయ్యో' 'యాక్సిడెంట్' లాంటి మాటలు దొర్లిపోతున్నాయి; ఒక్కసారిగా జనం మూగిపోయారు.

పెద్దాయన! పడిపోయివున్నాడు; కాలికి దెబ్బ తగిలింది; రక్తం కారుతోంది; హడావుడి మాటలేవో వినబడుతున్నాయి; ఒకాయనదైతే చాలా పెద్ద నోరు!

ప్రాథమిక కుతూహలం తీరిపోయాక, ఆయన చుట్టూ ఉన్న వలయంలోంచి ఒక్కొక్కరే వెనక్కి అడుగులు వేశారు. నేను ఉన్నచోటే ఉండటం వల్ల ముందుకైపోయాను.

సరే, ఇక చిత్తాన్ని స్థిరం చేసుకున్నాను. ఈయన బరువు ఇవ్వాళ నామీదే వేసుకుందాం!

ఆటోలోకి ఎక్కించడానికి ఇద్దరు ముగ్గురు సాయం పట్టారు. ఆటోలోకి నేను ఎక్కుతుండగా, పెద్దనోరాయన – "తమ్ముడూ, నీకేమైనా ప్రాబ్లమ్ వస్తే నాకు ఫోన్ చెయ్," అన్నాడు.

నేను నోటితో బదులివ్వకుండా, సరేనన్నట్టుగా తలూపాను.

మరీ పెద్ద ప్రమాదం ఏమీకాదు. పెద్దాయన మామూలుగానే ఉన్నాడు. ఆసుపత్రి ఫలానా చోట ఉందని డ్రైవర్‌ను ఆయనే గైడ్ చేశారు. మరీ యాక్సిడెంట్ అయిన మనిషిని ఒంటరిగా పంపడం ఇష్టంలేక వెళ్లడం లాంటిదే నాతోడు!

వెళ్తూ ఉండగా – నా పేరు, ఏం చేస్తావని అడిగారు; మరి ఇటువైపెందుకొచ్చావన్నారు.

రెండు నిమిషాలైన తర్వాత – "ఆ ఫోన్ చేయమన్నాయన ఎవరో నీకు తెలుసా?" అని అడిగారు. తెలీదని చెప్పాను. తల ముందుకూ వెనక్కీ ఆడించి, నెమ్మదిగా కళ్లు మూసుకున్నారు.

హాస్పిటల్‌కు చేరుకున్నాక – పేరు, చిరునామా ఏదో నింపాల్సివచ్చింది. ‘ముందు ఫస్ట్ ఎయిడ్ ఏదైనా చేయండమ్మా’ అని ఆయన కోప్పడ్డారు. ‘ఫార్మాలిటీస్ ఉంటాయిగదా సార్’ అని ఓ పిల్ల గొణిగింది. ఈలోగా ఒకావిడ వచ్చి, ఆయన్ని వేరే గదిలోకి నెట్టుకెళ్లింది. ఇది జరుగుతుండగానే ఆయన నాకో నంబరిచ్చి, వాళ్ల రెండో కూతురు దగ్గర్లోనే ఉంటుందట – ఫోన్ చేయమన్నారు; కంగారు పడాల్సిందేమీ లేదని కూడా చెప్పమన్నారు.

పదీ ఇరవైనిమిషాల్లో ఆమె వచ్చింది. వాళ్ల నాన్నను చూసింది. కాసేపటికి కుదుటపడింది. ప్రమాదం జరిగిందన్న ఉద్వేగంలోంచి సాధారణ విషయాలు మాట్లాడుకునే స్థితిలోకి వచ్చారు (‘అక్క పొద్దున ఫోన్ చేసింది...’). ఇంకా నేను అక్కడ ఎందుకు కొనసాగాలో నాకు అర్థంకాని దశలో – “చాలా థాంక్సండీ,” అని ఆమె నాకు బదులు ఇచ్చింది; ఇక మీరు వెళ్తే వెళ్లండి అన్నట్టుగా. ఆయనతో చేయి కలిపి, నేను ఎదుర్కొన్న దృశ్యానికి నిండుదనం చేకూర్చాననన్న నమ్మకంతో అక్కణ్నుంచి వచ్చేశాను.

★ ★ ★

ఇది జరిగి కనీసం పన్నెండేళ్లయినా అయివుంటుంది. నాకు జరిగిన ఒక అనుభవాన్ని తిరిగి చెప్పడానికి కావాల్సిన ఒక నిర్మాణాన్ని పాటించానేగానీ నిజానికి ఇందులో చాలా విషయాలు నాకు ఇప్పుడు గుర్తులేవు. అంటే అసలు యాక్సిడెంట్ ఎలా అయింది... ఈయన్ని ఏదైనా బైక్ ఢీకొట్టిందా? ఆటోనా? ఈయనే రోడ్డు మీద నడుస్తూ దేనికైనా కంగారుపడి పడిపోయాడా? లేకపోతే తలతిరిగిందా?దెబ్బ సరిగ్గా ఏ భాగానికి తగిలింది? మోకాలి పైకా, కిందికా? ఎడమ కాలా, కుడికాలా? అసలు కాలికేనా?

ఆయన ముఖం గుర్తులేదు. అటు మరీ సన్నగానూ ఇటు మరీ లావుగానూ కాని నడిమిరకం దేహం. సంభాషణలో ఆయన పేరు, చేస్తున్న పని నాకు చెప్పడమైతే చెప్పినట్టుగా గుర్తుందిగానీ చెప్పిందేమిటో గుర్తులేదు. పేరు చివర ‘రావు’ వస్తుందేమోననిపిస్తోంది. బహుశా పూర్ణచంద్రరావు? వాళ్లమ్మాయి కొద్దిగా లావుగా ఉందని లీలగా జ్ఞాపకం. లేతరంగు పంజాబీ డ్రెస్ ధరించినట్టనిపిస్తోంది. ఇంతకీ నేను ఎందులో ప్రయాణిస్తున్నాను? బస్సా, ఆటోనా? ఆటోవైపే జ్ఞాపకం మొగ్గుతోంది.

చిత్రంగా ఆ హడావుడి మనిషి కూడా గుర్తులేదు. కానీ ఈ సంఘటనను తలుచుకున్నప్పుడల్లా ఆయనకు నేను ఒక తెల్లచొక్కా తొడిగి, చేతికి ఒక బంగారు ఉంగరం పెడుతుంటాను. హాస్పిటల్ పేరేమిటో గుర్తులేదు; కానీ చంద్రుడికి సంబంధించిన ఏదో పదం దాని పేరులో కలిసివుందనిపిస్తోంది. రిసెప్షన్ మాత్రం ఎడమవైపున్నట్టుగా గుర్తుంది.

ఇంకా ఆలోచిస్తే — ఫోన్ చేయమన్నప్పుడు ఆయన నాకు నంబర్ నోటితో చెప్పాడా? లేక, జేబులోంచి నోట్‌బుక్ తీసిచ్చి, ఇదీ నంబరని వేలితో చూపించాడా? అక్కడే ఏదైనా డైలీ పేపర్ ముక్క చింపి అందులో రాసిచ్చాడా?

అంటే... ఒక స్క్రీన్‌ప్లేకు అవసరమైన సూక్ష్మవివరాలు గుర్తులేవు. నేను ఆ దృశ్యంలో భాగంగా ఉన్నప్పుడు నాకు ఇవన్నీ గుర్తుండేవుంటాయి. కానీ ఇప్పుడు నేను ఆ దృశ్యాన్ని దాటిపోయి కేవలం ఒక భావంగా మాత్రమే మిగిలిపోయాను.

★ ★ ★

నాకున్న అలవాటుకొద్దీ దీన్నంతటినీ సమ్ అప్ చేసుకోవడానికి ప్రయత్నించాను. ఈ సంఘటన అంతటినీ ఒక దృశ్యంగానూ, సంఘటన అనంతర స్థితిని భావంగానూ రాస్తున్నానిక్కడ.

దృశ్యం బలమైనదంటారుగానీ, అది పూర్తి నిజం కాదని తెలిసిపోతూనేవుంది; అలాగని అది పూర్తి బలహీనమైనదీ కాదు; కాబట్టే, ఛాయామాత్రంగానైనా నాలో మిగిలేవుంది. అయితే, నాలో మిగిలిపోయింది నిజమైన దృశ్యమేనా? అంటే, వాళ్లకు నేను ఏ రూపు అద్దానో అది నిజంగా నిజం మీదే ఆధారపడినదా? లేక, నా జ్ఞాపకంలో కరిగిపోయాక మిగిలిన దానికి, నాదైన పదార్థాన్నిచ్చి నిలబెట్టానా?

మరి, ఇంత బలహీనంగా ఉన్నప్పటికీ, ఆ దృశ్యం నాకు జ్ఞాపకంగా ఎలా మారగలిగింది? దృశ్యాన్ని మించినదేదో దాన్ని నాలో నిలిపివుంచడానికి కారణమైందని నమ్ముతున్నాను. అందుకే నేననుకోవడం, ఒక్కోసారి దృశ్యం (వాస్తవం) అప్రస్తుతమైపోయి, భావం మాత్రమే ప్రస్తుతమవుతుందేమో!

దీన్ని ఇంకా కొనసాగిస్తే, మన జీవితంలో కూడా మన హోదా, ఆస్తి... ఇవన్నీ మరుగునపడిపోయి, చిట్టచివరికి మనం ఏ భావం దగ్గర తేలుతామన్నదే ముఖ్యమైపోతుందేమో!

ఇదే చిట్టచివరకు ప్రధానమవుతుందని ‘తెలిసిరావడం’తో, నా ఎన్నో ప్రశ్నలకు సమాధానం దొరికినట్టయింది; ఒకరకమైన శాంతి లభించినట్టయింది.

– పూదూరి రాజిరెడ్డి

poodoorirajireddy@gmail.com

For Latest Telugu Books - Visit now:

Kinige.com